కథా నిలయం
శ్రీకాకుళం

# విరమణీయం

సుజాత టీచర్ 'క్లాస్‌రూమ్'లోకి అడుగుపెట్టగానే, "సైలెన్స్ - సైలెన్స్" అంటూ, బెత్తంతో టేబుల్ మీద బాదుతూ గట్టిగా అరచింది. వందమందికిపైగా ఉన్న క్లాస్ రూమ్‌కావటంతో, 9వ తరగతి విద్యార్థులైనప్పటికీ, ఎలిమెంటరీ స్కూల్ కోలాహలం వినిపిస్తూంటుందక్కడ. మరీ మరీ అరవటంతో, నాలుగైదు నిమిషాల తర్వాత నిశ్శబ్దం నెలకొనింది.

"మీ అందరికీ ఒక ముఖ్య విషయం చెప్పాలి. జాగ్రత్తగా వినండి" అందామె. అంత ముఖ్యమైన విషయం ఏమిటబ్బా అని పిల్లలంతా అలర్ట్ అయిపోయారు. రెండోవరుసలో కూచున్న రాజేశ్వరి, నిలువెత్తు నిల్చున్న టీచర్‌వేపు కళ్లప్పగించి చూసింది.

"మన స్కూల్ హెడ్మాస్టర్, ఈ నెల 30వ తేదీన రిటైర్డ్ కాబోతున్నారు. మీకు తెలుసా." అని, ఒక్క క్షణం ఆగి జవాబు నాశిస్తూ విద్యార్థులవైపు చూసిందామె.

"తెలీదు టీచర్" అంటూ ముక్తకంఠంతో గట్టిగా అరిచారు పిల్లలంతా.

"అబ్బబ్బ, మళ్లీ ఒకటే అరుపులు, సైలెన్స్, సైలెన్స్" అంటూ బెత్తంతో తనముందు నిస్సహాయంగా నిల్చున్న టేబుల్‌ను గట్టిగా బాదింది సుజాత టీచర్.

"ఏదో ప్రమాదం రాబోతోంది" అని వెంటనే శంకించిన రాజేశ్వరి, పక్కన కూచున్న వనజాక్షిని మోచేత్తో నిశ్శబ్దంగా పొడిచింది. దాన్ని గ్రహించినట్టుగా వనజాక్షి చిరునవ్వు నవ్వి టీచర్‌వేపు చూసింది. అదేక్షణంలో సుజాత చూపులు ఆ పిల్లపై పడ్డాయి. ఆ పిల్ల పెదాలమీద కన్పించిన చిరునవ్వులో ఏదో వ్యంగ్యంలాంటిది స్ఫురించినట్టయి, "ఏమిటే నవ్వుతున్నావ్" అంటూ గట్టిగా గద్దించింది. " ఏంలేదు టీచర్" అంటూ పెదాలు ముడుచుకొని సీరియస్‌గా వుండిపోయిందా పిల్ల-

"ఏమిటే సీరియస్‌గా చూస్తున్నావ్! లేచి నిలబడు" అంటూ మరింత గట్టిగా అరిచింది బెత్తం ఝళిపిస్తూ.

వనజాక్షి, మనసులోనే తలబాదుకుంటూ నిర్లిప్తంగా లేచి నిలబడింది – తన కంటే చాలా పెద్దది కాబట్టిన్నూ, పైగా టీచర్ కాబట్టిన్నూ. సుజాత బతికిపోయింది. లేకపోతే జుట్టుపీకి నాలుగు గుద్దులు గుద్దేదే. సుజాత టీచర్‌ను, రెండేళ్లుగా భరిస్తూ ఆ స్థితికి వచ్చేసింది ఆ పిల్ల.

"నేనేదో చెప్పబోతుంటే ఏమిటే నీ వ్యవహారం" మరీ మరీ రెచ్చిపోతున్న టీచర్‌వేపు చూసి, ప్రక్కన కూచున్న రాజేశ్వరి, శాంతం అని అర్థమయ్యేలా వనజాక్షి పాదాన్ని తన చేతివేలితో మీటింది. ఆ సైగను అర్థం చేసుకున్న ఆ పిల్ల "ఏం లేదు టీచర్" అంది అపలాజికల్‌గా.

"సరే కూచో" అంటూ క్షమించేస్తున్నట్టు గద్దించింది సుజాత.

వనజాక్షి కూచుని రాజేశ్వరివేపు చూసింది చిలిపిగా.

"ఆ– ఏమన్నాను. మన హెడ్మాస్టర్ రిటైర్డ్ కాబోతున్నారు, అన్నాను గదా"

"అవును టీచర్. అవును టీచర్" అంటూ మళ్ళీ అరుపులు–

"అబ్బబ్బ, ఈ గోల భరించలేక ఛస్తున్నానర్రా, ఇక నిశ్శబ్దంగా వినండి" అందామె.

"వింటాం టీచర్" అంటూ మళ్లీ అరుపులు.

ఉస్సూరంటూ ఒక్క నిమిషం వైరాగ్యంలో మునిగింది సుజాత.

రాజేశ్వరికీ, వనజాక్షికీ, అప్పటికే సంగతి అర్థమయిపోయినట్లు, పరస్పరం శరీరస్పర్శలతోనే మాట్లాడేసుకున్నారు.

సుజాత టీచర్ మళ్లీ మొదలుపెట్టింది.

"మన హెడ్మాస్టర్ ఈ నెల 30వ తేదీన రిటైర్డ్ అవుతారని చెప్పానుగదా! ఆయన మన స్కూల్లో నాలుగేళ్లుగా పని చేస్తున్నారు. అందువల్ల ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఒక పెద్ద సభ ఏర్పాటుచేసి, మనం వీడ్కోలు ఇవ్వాలి. మనం ఆయనకు ఒక మంచి కానుక ఇవ్వాలి. కాబట్టి మన స్కూల్లోని ప్రతి విద్యార్థి కొంతమొత్తాన్ని ఇవ్వాలి" అంది సుజాత.

ఈ మాటలు వినగానే పిల్లలంతా నీరసపడిపోయారు. పక్కవాళ్లతో చకచక గుసగుసలు మొదలయ్యాయి. "అనుకున్న ప్రమాదం ఇదే – నాకు ముందే తెలుసు" అంది మెల్లగా రాజేశ్వరి వనజాక్షితో.

"మన స్కూల్లో 6,7 తరగతుల పిల్లలు 5 రూపాయల వంతునా, 8, 9, 10 తరగతుల పిల్లలు 10 రూపాయల వంతునా ఇవ్వాలని మేము నిర్ణయం చేశాం.

మీరు ఈ శనివారంలోగా పది రూపాయలివ్వాలి" ఎంతో అనునయంగా చెప్పింది సుజాత టీచర్.

"ఏమర్రా, ఉలకరూ, పలకరూ చెప్పండి" అంటూ గొంతు పెద్దది చేసింది టీచర్.

"అలాగే టీచర్" అంటూ కీచుస్వరం వినిపించారు పిల్లలు.

ఆ పిల్లలకు ఇలాంటి అనుభవాలు కొత్తవేమీ కావు.

గత సంవత్సరం, ఒక సైన్స్‌టీచర్, అంతకు మునుపు సంవత్సరం ఒక తెలుగు పండిట్, బదిలీ అయిన సందర్భంలో కూడా ఈ వసూళ్ల కార్యక్రమం జరిగింది. ప్రతి సంవత్సరమూ జరిగే ఈ తంతుపట్ల పిల్లలకు ఆసక్తీలేదు, ఆదరణాలేదు. అయినా తప్పదు గనుక, అడిగింది ఇస్తూనే ఉంటారు ఉదారంగా.

ఇప్పుడు ఈ హెడ్మాస్టర్ ఉద్యోగ విరమణ! స్కూల్ మొత్తంమీద ఆరువందలకుపైగా విద్యార్థులు. చిన్న తరగతులు ఐదూ, పెద్ద తరగతులు పదినట. రాజేశ్వరి పెన్ను తీసుకొని నోట్ పుస్తకం వెనుక చక చకా లెక్కలు వేసి దాదాపు ఐదు వేల రూపాయలు అంటూ తేల్చేసింది.

"ఈ హెడ్మాస్టర్‌తో తమకేం సంబంధమబ్బా" అంటూ వాళ్లంతా గుసగుసలు పోయారు. ఈ నాలుగేళ్లుగా ఆయన తమ క్లాసుకు ఎప్పుడూ వచ్చిందీ లేదు. తమతో మాట్లాడింది అసలే లేదు. ఒక్క 10వ తరగతికి మాత్రమే ఇంగ్లీషు చెబుతాడాయన. "అయినా అంతంత జీతాలు తీసుకుంటూ, ఈ చిన్నకానుకలకు ఆశపడటం ఏం న్యాయం" అంది రాజేశ్వరి, వనజాక్షితో – "పిల్లలతో వసూళ్లుచేసి విందులు తినటమూ, సన్మానాలు చేయించుకోవటమూ ఏం బావుంటుంది?" అంది వనజాక్షి.

★ ★ ★ ★

30వ తేదీ రానే వచ్చింది.

ఆ రోజు స్కూలంతా మహాసందడిగా వుంది.

స్కూల్ ప్రాంగణమంతా, మైకులో ధ్వనిస్తున్న చెత్తాచెదారం పాటలతో మారుమ్రోగిపోతోంది. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశ వేదిక అట్టహాసంతో వెలిగిపోతోంది. రంగురంగుల కాగితాలతో సమావేశ స్థలమంతా అలంకరింపబడి వుంది. సమావేశ వేదిక తగినంత ఎత్తులో హుందాగా ఉంది. వేదికను, అందమైన షామియానా, కప్పివేస్తూ గంభీరంగా కన్పిస్తోంది. వేదిక మీద దాదాపు 12 కుర్చీలు వేసి వున్నారు. కుర్చీల ముందు పొడవుగా నాలుగు టేబుళ్లూ, టేబుళ్ల మీద పరచిన అందమైన కర్టెన్లూ, వాటిపై ఫ్లవర్‌వాజ్‌లూ, అగరొత్తుల ధూపమూ, ఇదంతా ఒక ఆహ్లాదకర వాతావరణాన్ని స్ఫురింపచేస్తూ వుంది. సమావేశ స్థలంలో మొదటి వరుసల్లో విద్యార్థినులూ, వెనుక వరుసల్లో తరగతుల వారీగా విద్యార్థులూ కూలబడి వున్నారు.

వాళ్లు అల్లరి చేయకుండా ఉండటానికి, ఆ స్కూల్ ఉపాధ్యాయులు, బెత్తాలు పట్టుకొని, బారెడు కొకరు చుట్టూరా నిలబడి వున్నారు.

ఆ పాఠశాల హెడ్మాస్టర్ రామనాథం, ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలుకోసం ఈ ఆర్భాటమంతా. ఆ సభలో అతిథులుగా జిల్లా పరిషత్తు అధ్యక్షులూ, జిల్లా పరిషత్తు సి.ఇ.ఓ; జిల్లా విద్యాశాఖాధికారీ, స్థానిక నియోజకవర్గ శాసనసభ్యులూ, మండలాధ్యక్షులూ, వీళ్లుగాక వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులూ, ప్రతినిధులూ పాల్గొంటున్నారు. సభకు ఎవరెవర్ని పిలిపించాలో నిర్దేశించింది కూడా ఆ హెడ్మాస్టరే. సమావేశ వేదిక ఎలా ఏర్పాటు చేయాలి, వీడియో, కెమేరాల వ్యవహారమూ, పత్రికా విలేఖర్లకు ప్రత్యేక ఆహ్వానమూ, ఆహ్వాన పత్రికల డిజైనింగూ, అంతా ఆ హెడ్మాస్టరు పర్యవేక్షణలో జరిగిపోయింది. ఎంత గొప్పగా తన వీడ్కోలు సభ జరిగితే, అంత ప్రతిష్ఠాత్మక వ్యవహారంగా ఆయన దాన్ని భావించాడు మరి. వారంరోజుల క్రితమే ఆహ్వాన పత్రికలు అచ్చువేసి, జిల్లాలోని అన్ని స్కూళ్లకూ పంపిణీ చేశారు. హెడ్మాస్టర్‌కు సన్నిహితులైన మిత్రులూ, బంధువులూ, కుటుంబ సభ్యులూ కూడా ఆ సమావేశానికి అప్పటికే విచ్చేసి వున్నారు.

ఈ మధ్యకాలంలో ఉద్యోగ విరమణ అన్నది కూడా ఒక గొప్ప వేడుకగా జరపటం అలవాటైపోయింది దేశమంతా! ఇంతకు మునుపు కాలంలో ఏదైనా పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణచేస్తే అది కేవలం ఆ స్కూల్ వ్యవహారం మాత్రమే. స్కూల్ విద్యార్థులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, పూలదండవేసి, శాలువాకప్పి, ఒక చిన్న జ్ఞాపిక ఇచ్చి గౌరవంగా వీడ్కోలు చెప్పేవారు. ఈ ఆహ్వాన పత్రికలూ, అతిథుల సందడులూ, అధికార, అనధికారులకు ఆతిథ్యాలూ, పత్రికల్లో శుభాకాంక్షల ప్రకటనలూ ఇవేవీ వుండేవి కావు.

ఇప్పుడలా కాదు...

ఎలా జరుగుతుందంటారా? చూడండి...

అతిథులందరి విందుభోజనాల తర్వాత రెండున్నర గంటలు కావస్తూండగా, ఆ పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ స్వాగతం పలుకగా, అతిథులందరూ వేదిక మీద ఆసీనులయ్యారు.

సభకు అధ్యక్షుడు, జిల్లా పరిషత్తు ఛైర్మన్, ఆయనకు ఈ హెడ్మాస్టర్‌తో కేవలం పరిచయం తప్ప, తెలిసింది చాలా తక్కువ అయినా, ఆయన తన అధ్యక్షోపన్యాసంలో, హెడ్మాస్టర్ గుణగణాలనూ, వ్యక్తిత్వాన్నీ కీర్తించి, ఈ సభలో తాను పాల్గొనటం ఒక గొప్ప అనుభూతినీ, ఆనందాన్నీ ఇచ్చిందని, ఆ తర్వాతి బాధ్యతను ఇతర ఉపన్యాసకులకు అప్పగించాడు. వచ్చిన వాళ్లంతా కూడా, మీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదర్శగురువనీ, తన జీవితాన్నంతా విద్యాబోధనకు అంకితం చేసినవాడనీ, మంచి ఫలితాలు సాధించినాడనీ పొగడ్తలు కురిపిస్తూంటే, ఆ హెడ్మాస్టర్

చిద్విలాసంగా మందహాసం చిందిస్తూ అమందానందాన్ని అనుభవిస్తూ, అరమోడ్పు కన్నులతో సుఖాసీనుడై వున్నాడు. ఈ పొగడ్తల కోసమే గదా ఈ సభ! సభలో కూచున్న విద్యార్థులు, ఆవులిస్తోనో, పక్కవాడిని గిచ్చుతూనో, గిల్లుతూనో, చిన్న చిన్న రాళ్లు పోగుచేసుకొని, ముందు వరుసల్లో కూచున్న వాళ్లమీద చిలిపిగా విసురుతూనే కాలక్షేపం చేసేస్తున్నారు.

"మన డబ్బులు వసూలుచేసి, సుష్టుగా డిన్నర్లు తిని మనల్ని ఎండలో పారేసి, వాళ్ళేమో షామియనా కింద నీడలో కూచుని హాయిగా కీర్తనలు పాడుకుంటున్నారు" అని ఓ పదో తరగతి విద్యార్థి వ్యాఖ్యానిస్తుంటే పక్కవాళ్లు ఆనందిస్తున్నారు.

అందరి కీర్తనలూ గంటన్నరకు పైగా అనర్గళంగా సాగినాయి. పిల్లలు వాళ్ల ధోరణిలో వాళ్లు కాలక్షేపం చేస్తున్నారు. పిల్లల గుసగుసలు ఎక్కువవైనపుడల్లా ఉపాధ్యాయులు బెత్తాలు ఝుళిపిస్తూ హెచ్చరికలు చేస్తున్నారు.

ఇక చివరి కార్యక్రమం, హెడ్మాస్టర్‌కు సన్మానం - అధ్యక్షులు ప్రకటించగానే, పాఠశాల తరపున, పెద్దపూలమాలవేసి, శాలువా కప్పి, ఒక బంగారు ఉంగరాన్ని అతని వేలికి తొడిగి, పిల్లలచేత పెద్దగా చప్పట్లు కొట్టించారు. స్కూలు కమిటీ తరపున ఒక పూలమాలవేసి, శాలువా కప్పి, ఒక పెద్ద డిన్నర్‌సెట్‌ను బహూకరించారు. వీడియో కెమెరాలు ధారాపాతంగా దృశ్యీకరిస్తుండగా కెమేరాలు క్లిక్ క్లిక్‌మంటూ ఫోటోలు తీస్తుండగా, సన్మాన కార్యక్రమం కొనసాగుతూంది. వచ్చిన మిత్రులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులూ, బంధువులూ వరుసక్రమంలో వచ్చి, పూలమాలలు వెయ్యటమూ, కానుకలు చదివించటమూ... ఫోటోలు దిగటమూ...పాతికపైగా శాలువలూ, గడియారాలు, పెన్నులు, ఫ్లాస్కులూ, ఇలా పలురకాల బహుమతులూ పుచ్చుకున్నారు ఆ హెడ్మాస్టర్. ఒక పెళ్లితంతు జరిగినంత పనయిందక్కడ. ఆయనకు తన పెళ్లినాడు కూడా అన్ని కానుకలు వచ్చి వుండవు. చాలా బహుమానాలు, మొహమాటాని కోసం, తప్పనిసరి కాబట్టిన్నూ, వచ్చేది వస్తూ వుత్తచేతుల్తో ఎలా రావటమబ్బా అంటూ తెచ్చినవే. ఇలాంటి సంప్రదాయాలు అలవాటయినాక, ఈ కృత్రిమ పద్ధతులన్నీ తప్పనిసరి అవుతాయి దేశంలో.

విద్యార్థులంతా ఈ తతంగాన్నంతా చప్పట్లు కొట్టి కొట్టి తిలకించారు. ఇదంతా వాళ్లకు ఒక సరదా వ్యవహారం మాత్రమే! చివరగా ప్రధానోపాధ్యాయుడు రామనాథం లేచి నిలబడి, ఉత్తుత్త కన్నీళ్లు కారుస్తూ అందరికీ పేరు పేరునా ధన్యవాదాలు, నమస్కారాలు చెప్పి, "మీరు చేసిన ఈ సన్మానాన్నీ, అభినందనల్ని నేను జన్మలో మరువలేను. మీ ప్రేమాభిమానాల్ని ఎప్పుడూ గుర్తుంచుకుంటాను" అని మొదలుపెట్టి తన జీవితగాథనంతా ఏకరువు పెట్టేశారాయన. తన జీవిత విశేషాలు వినటంపట్ల విద్యార్థులకు ఏ మాత్రం ఆసక్తి వుంటుంది అన్న ఆలోచన లేదాయనకు. సాయంకాలం అయిదు కావస్తున్నా సభ ముగియలేదు. అందరూ అసహనంగా కదుల్తున్నారు.

రాజేశ్వరి, వనజాక్షి, ఒకర్నొకరు చూస్తూ ఒకటే నవ్వుకుంటున్నారు. "చూశావా, వనజా! మనం ఈయనకు వీడ్కోలు చెప్పినామట! సత్కరించినామట. బలవంతంగా మనతో పదులు పదులు వసూళ్లుచేసి, వాళ్లకు నచ్చిన కానుకలు కొనుక్కొని, విందులు తిని, ఇదంతా మనం ప్రేమతో చేసినట్లుగా ఎలా చెప్పుకుంటున్నారో చూడు" అంటూంటే వనజాక్షి పగలపడి పగలబడి నవ్వేస్తోంది. ఆ నవ్వులు విని "సైలెన్స్, సైలెన్స్" అంటూ బెత్తం పట్టుకొని వస్తోంది సుజాత టీచర్.

● *ఉపాధ్యాయ – ఫిబ్రవరి, 2002* ●